# "ప్లీజ్.. నా కథ రాయండి!"

–వి. హెచ్. ఆర్. సుంకర

**నేనా స్కూల్లో జాయిన్ అయి దాదాపు 'సంవత్సర కాలం' గడిచిపోయినా... 'హెడ్‌మాస్టర్‌గా' ఎంతమందికి తెలుసో నాకు తెలియదుగానీ, 'రచయితగా' ఆ వూరి ప్రజలందరికీ పరిచయమై పోయానని తెలుసు.**

ఆ రోజు అదివారం...

శ్రీమతి పుట్టింటికెళ్లి వారం రోజులు దాటి పోయింది!

తీరుబడిగా... వంట కార్యక్రమాన్ని ప్రారంభించానో... లేదో... వీధి తలుపు చప్పుడైంది.

చెప్పాపెట్టకుండా 'శ్రీమతి' వచ్చేసిందేమోనని... ఆతృతగా తలుపుతీసి... ఆశ్చర్యంతో... అలానే నిలబడి పోయాను.

ఎదురుగా... 'రాజమ్మ' నిజంగా రాజమ్మేనా? అని అబ్బుర పడేంతగా...మారి పోయింది!

మజంటా కలర్ శారీ... మ్యాచింగ్ బ్లౌజ్...!

తలనిండా... మనోహరంగా ... మల్లెపూలు!

చేతిలో స్వీట్ బాక్స్...

ఇవికాదు నన్ను చకితుణ్ణి చేసింది.

ఆమె ముఖంలో కనిపిస్తున్న 'కాంతి'

ఆకాంతి వెనుక తొంగి చూస్తున్న 'ఆత్మ విశ్వాసం'... ఇవే.

''నేనుసార్... 'రాజమ్మ'ని గుర్తు పట్టలేదా? ఇవ్వాళ నా...పుట్టిన రోజు... ఇవ్వాళే నిజమైన జన్మదినం... నా ఆనందాన్ని మీ ఒక్కరితోనే పంచుకోవాలని...''

స్వీట్ బాక్స్‌నా కందిస్తూ... అంది.

అప్పటికే మతి పోగొట్టుకున్న నాకు... ఎలా స్పందించాలో అర్థంగాక... బుర్రంతా... ఖాళీ అయి పోయినట్టు అన్పించింది!

నా రైటింగ్ టేబుల్ ముందున్న ఒకే ఒక కుర్చీని లాగి...

కూర్చోమన్నట్టు సైగచేసి... స్వీట్ బాక్స్ ఓపెన్ చేసి...

తన స్వీటు అందించబోయాను.

''అయ్యయ్యో... మీరు తినండి.. నేను స్వీట్లు తినడానికి రాలేదు మీతో ఒక మాట చెప్పిపోదామని వచ్చాను.''

అంటూ తిరిగి స్వీట్‌నా చేతిలో పెట్టి... మూలనున్న స్టూల్ తెచ్చుకొని... కూర్చుండి పోయింది.

అసలు రాజమ్మ... అలా రావడమే ... ఓ 'వండర్' అలా రావడమే కాకుండా... 'బర్తడే అంటూ...'

ఆలోచనల మధ్య వుండగానే... రాజమ్మే...

''నేనెందుకొచ్చానని... ఆలోచిస్తున్నారా?... మీరు 'రచయితలు' కదా! నా కథ రాస్తారేమో?...




'ముగింపు' చెప్పి పోదామని'' నా మనసులోని మాటలు గ్రహించిన దానిలా... నా వంక చూస్తూ అంది... నేను మాట్లాడేలోగా... తనే- మళ్లీ,

''మీరిచ్చే ముగింపేమిటో... మీకు మాత్రమే తెలుసు- నేనిచ్చే ముగింపేమిటో... నాకు మాత్రమే తెలుసు... ముగింపు 'వాస్తవంగా' వుండాలంటే... అదేమిటో నేనే చెప్పాలి! కథలెన్నటికీ జీవితాలు కాలేవు!... కానీ జీవితాలే కథలవుతాయి. అలాంటి కథలే... సమాజానికి 'మార్గదర్శకాలవుతాయి' నేను... మీకు చెప్పగలిగేదాన్ని కాదనుకోండి...''

అంటూనే 'కథ' ఎలా వుండాలో 'ఖచ్చితం'గా చెప్పింది. ఈ రాజమ్మేనా ఆనాడు... 'అలా'... అని అనుకుంటుండగానే నెల రోజుల క్రితం... జరిగిన... 'పంచాయతీ' మనసులో మెదిలింది.

★★★★

సాయంత్రం స్కూలయిపోగానే 'పంచాయతీ' వుందనీ, గ్రామం పెద్ద లక్ష్మీపతి గారొస్తున్నారనీ... అటెండర్ ఆగమయ్య చెప్పడంతో... నాలో 'కుతూహలం' పెరిగిపోయింది- ఆనాటి పంచాయతీ ఎవరిదోనని?

ఆఖరి పీరియడ్ అయిపోతుండగా... వచ్చి... నా ముందు మౌనంగా కూర్చుండిపోయాడు... హిందీ మాస్టర్ 'రమణ'.

విశేషాలేమిటని అడగబోతుండగా... అతనే అన్నాడు.

''సార్... యివాల్టి 'పంచాయతీ' మన మూర్తి గారిదే'' అని.

''ఏ విషయంలో?'' మామూలుగా అడిగాను.

''అదే... మూర్తిగారికి... అతని భార్య రాజేశ్వరి... అదే...

'రాజమ్మ' అంటారు ఆమెకీ... ఏవో గొడవలట...''

అతనా మాటలు పూర్తి చేస్తుండగానే లక్ష్మీపతి గారొచ్చేశారు.

అందరం... పదో తరగతి గదిలో సమావేశమయ్యాం. 'పంచాయతీ పెద్దగా..' లక్ష్మీపతి గారితో బాటు... నేను కూడా వ్యవహరించాల్సి వచ్చింది.

మాసిపోయిన బట్టలతో... రేగిన జుట్టుతో... శోకమూర్తిలా వచ్చిన... 'రాజమ్మ' మాకు నమస్కరించి...

ఓ మూలగా... కూర్చుండి పోయింది.

హిందీ మాస్టర్ రమణతో కలిసి వచ్చారు... మూర్తిగారు... వస్తూనే నమస్కరించి,

''అయ్యా! నేనీ స్కూలుకొచ్చి దాదాపు అయిదు సంవత్సరాలు అయిపోతోంది. నా గురించి మీకు తెలియనిదేమీ లేదు!

ఈమె నా భార్య... 'రాజేశ్వరి.' మా వివాహమై దాదాపు అయిదు సంవత్సరాలు నిండిపోయాయి. తనకు ఏ విషయంలో కూడా తక్కువ చేయలేదు.

అడిగినన్ని చీరలు కొని పెట్టాను!

కావలసిన నగలు చేయించాను!

నెలకు రెండు నిసి మాలు చూపిస్తున్నాను!

అయినా... ఆమె నన్ను లక్ష్య పెట్టడం లేదు

నేను చెప్పినట్టు వినడం లేదు.

గత సంవత్సరం నుంచి.. మా పక్క పోర్షనులో వుంటున్న 'రాజారాం'తో చాలా 'చనువు'గా ప్రవర్తిసోంది!

నయానా భయానా చెప్పి చూశాను... వినలేదు!

పురాణాలు చదివించాను. పతివ్రతల కథలు వినిపించాను.. ఎన్ని ప్రయత్నాలు చేసినా... ఆమె తన ప్రవర్తన మార్చుకో లేదు... ఇప్పటికే ఈ విషయం చాలా మందికి తెలిసిపోయింది. ఉపాధ్యాయునిగా నాకున్న పరువంతా గంగలో కలిసిపోయింది. మీరు నా సహోపాధ్యాయులు... అందుకే మీ అందరి సమక్షంలో నా సమస్యను విన్నవించు కుంటున్నాను.

నా సమస్యను సహృదయంతో అర్థం చేసుకుని...

ఆమెను మందలించి... మా కాపురాన్ని నిలబెట్టండి!'' అని కూర్చుండి పోయాడు.

మూర్తిగారి మాటలు నాకెంతో నచ్చాయి!

అంత అనుమానమున్నా... కేవలం 'మందలించి' కాపురాన్ని చక్కదిద్దిమన్నాడే తప్ప- ఆమెను వదిలేస్తాననలేదు!

లక్ష్మీపతి గారు... రాజమ్మను తన దగ్గరకు పిలిపించుకున్నారు.

''తల్లీ!... మూర్తిగారి మాటలు విన్నావు కదా! ఆయన చేసిన అభియోగానికి నీ సమాధానమేమిటి? అసలు మీ మధ్య నున్న సమస్యేమిటో చెప్తే... 'పరిష్కారం' కోసం... మా శాయశక్తులా కృషి చేస్తాం... చెప్పమ్మా... నీ తండ్రిలాంటి వాడిని...''


ఆయనెంతగా అడిగినా... ఆమె పెదవి విప్పలేదు!

కనీసం దించుకున్న తలెత్తైనా... చూడలేదు!

అంతలో మళ్ళీ మూర్తిగారే లేచి... అన్నారు...

''అయ్యా! ఆమెకు విడాకు లివ్వాలనే ఆలోచన నాకు లేదు.






భర్తగా గౌరవించి, మంచిగా నడుచుకుంటా నంటే అంతేచాలు''

''మరికేం... రాజమ్మా...! మూర్తిగారు చెప్పింది 'సబబే' కదా!''

తొలిసారిగా నోరిప్పాను నేను.

మూర్తిగారి మాటల్లోని నిజాయితీ, సిన్సియారిటీ నాకెంతగానో నచ్చాయి!

నామాటలు వింటూనే ఓసారి 'కళ్లెత్తి చూసింది'!

'కోపం... ద్వేషం... నిస్సహాయత... తొంగి చూశాయి. ఆ చూపుల్తో! మళ్ళీ తలదించుకుని-. మౌనంగా వుండిపోయింది.

ఆమెను మాట్లాడించడం... సాధ్యమయ్యే విష యంలా కన్పించలేదు.

పోనీ... 'రాజారాం'ని పిలిపించి మాట్లాడ దామా?

నాకు మాత్రమే వినిపించేలా... అన్నారు లక్ష్మీపతి గారు.

''ప్రయోజన ముండదు సరికదా... లేనిపోని సమస్యతో 'గొడవ' యింకా 'ముదిరిపోతుంది' చూద్దాం... మరోసారి ప్రయత్నిద్దాం... ఆమె నోరిప్పితే తప్పు... 'దారి దొరకదు'-'' అన్నాను.

లక్ష్మీపతిగారు' ఆమెనెంతోగానో అనునయిం చారు.

నేను కూడా... రెండు మూడుసార్లు రెట్టించాను.

అప్పుడు నోరిప్పింది... 'రాజేశ్వరి.'

''నేను చేసింది తప్పే! నన్నొదిలేయమని చెప్పండి!

నా బ్రతుకు నేను బ్రతుకుతా! విడాకు పత్రాల మీద సంతకం చేసిస్తా!''

ఆమె మాటలు వింటూనే శిలాప్రతిమలై పోయా రందరూ!

ఆమె ధైర్యానికీ... తెగువకూ... ఆశ్చర్య పోయాను నేను!

''రాజమ్మా! మూర్తిగారు విడాకుల గురించి కాదు... ఈ పంచాయతీ పెట్టించింది... ఆయన కోరేదేమిటంటే... అతన్ని గౌరవిస్తూ... అన్యోన్యంగానే వుండమని.''

లక్ష్మీపతి గారి హితోపదేశం... ఆమెకంతగా రుచించినట్లు లేదు!

''రాజమ్మా! విడిపోవడమెంత సేపు చెప్పు! విడిపోయి యిద్దరూ చులకనైపోతారు...''




ఆ తర్వాతేం చెప్పాలా? అని ఆలోచిస్తుండగానో రాజమ్మ నోరిప్పింది.

''అయ్యా! నేనే బుద్ధి తక్కువ దాన్ని - నేనే తిరుగుబోతుని-నాదారిన నున్న వెళ్లిపోనివ్వండి! నా పెళ్లికి మా వాళ్లిచ్చిన 'కట్నం' కూడా తిరిగి యివ్వమని అడగను...''

ఆ మాటలు వింటూనే మూర్తిగారి ముఖం తెల్లగా పాలిపోయింది!

అయోమయంగా మా ముఖాలవంక చూశాడు..

'కొండనాలిక్కి మందేస్తే... వున్న నాలిక వూడిపోయింది'

అన్నట్లుంది పరిస్థితి.

ఏం చేయాలో...ఏం చెప్పాలో అర్థం కాని స్థితి..

మూర్తిగారు... లేచొచ్చి... లక్ష్మీపతిగారితో ఏదో... చెప్పాడు!

'రావుగారు! విడిపోవడమనే ఆలోచనే తనకు లేదనీ, ఆమెను కాస్త మందలించి వదిలేయ మంటున్నాడు 'మూర్తి' మరి మీరేమంటారు?''

నాకు మాత్రమే విన్పించేలా... లోగొంతుకతో అడిగారు... లక్ష్మీపతిగారు...

''తెగేదాకా లాగకుండానే... తెంచేసుకుంటా నంటోంది. 'ఆమె'ను మందలించే 'అవకాశం' మా చేతుల్లోంచి జారిపోయిందని అర్థమై పోయింది... తన తప్పును తానే నిర్భయంగా ఒప్పుకొని- దానికి పరి ష్కార మార్గాన్ని కూడా తానే సూచించింది.''

''అయితే రాజేశ్వరీ! మూర్తిగారి నుంచి విడిపోతానంటూన్నావ్? నీ పదో తరగతి క్వాలిఫి కేషన్‌తో ఎలా బ్రతుకుతావ్?''

లక్ష్మీపతిగారి ప్రశ్నకు తడుముకోకుండా...

''కూలి పని చేసుకుంటాను...'' అంది.

ఇక అనవసరమైన ప్రశ్నలతో... మరీ చిక్కు చిక్కు చేసే కన్నా - అనునయించి... మూర్తిగారితో 'కలిసి జీవించేలా' చేయడమే శ్రేయస్కరమనిపించింది... ఆ మాట లక్ష్మీపతి గారితో అన్నాను. ఆయనకూడా... అదే అభిప్రాయంలో వున్నారు.

అంతలో అటెండర్... ఆగమయ్య... వచ్చి...

''ఛాయ్ తండయిపొద్ది... ముందు తాగండి సార్'' అంటూ తలో 'టీ' కప్పు అందించాడు...

అప్పటికే చీకట్లు ముసురుకుంటున్నాయి.

ఆగమయ్య లైట్లు వేసేదాకా... అంత టైం అయిపోయిందనే ధ్యాసే కలగలేదు!

లక్ష్మీపతిగారు... 'తీర్పు' యిలా చెప్పాలను కుంటున్నానని నాతో చెప్పి - గొంతు సవరించుకుని మొదలు పెట్టారు.

''ఇప్పటికే చాలా టైమయిపోయింది! రాజమ్మా... నీ తండ్రి లాంటి వాడిని నేను... నీకు అన్నయ్యలాంటి వాడవుతారు ఈ రావుగారు... మేము మీ యిద్దరి క్షేమాన్ని కోరే వాళ్లం!

దయచేసి... మా మాట విని... అన్యోన్యంగా... కాపురం చేసుకోండి! చిన్నచిన్న కలహాలు - అపా




ర్థాలు - అనుమానాలు ... అందరి కుటుంబాల లోనూ వుండేవే...! ఇద్దరిలో 'ఎవరి తప్పున్నా' మరొకరు సర్దుకు పోవాలి తప్ప - ఆవేశాలకు - పట్టు దలలకూ పోయి - కాపురాన్ని పాడు చేసుకోకూడదు. అర్థమైందా?

ఇదిగో మూర్తి గారూ! చిన్నచిన్న విషయాలకు మనసు పాడు చేసుకుని... ఆమెను అనుమానించి - అవమానించకండి!

ఇక 'పంచాయతీ' అయిపోయినట్లే... మరి వస్తా''

అంటూ లక్ష్మీపతిగారు... బయటికి కెళ్ళిపో యారు.

మూర్తి ముఖం మాత్రం సంతోషంతో వెలిగి పోతోందని పించింది.

కొని తెచ్చుకున్న కష్టాల్లోంచి బయట పడినప్పుడు కలిగే ఆనందం అది.

కృతజ్ఞతలు చెప్పి - మూర్తిగారు బయటికెళ్లి పోయారు... రాజమ్మ అలాగే కూర్చుండి పోయింది!

నాపరాయి బండమీద ఏవేవో పిచ్చిగీతలు గీస్తోంది... కారిన తన కన్నీటితో - అది చూస్తూనే-

'నాగుండె నెవరో పిండి నట్లైంది!'

''రాజేశ్వరీ! అయిందేదో అయిపోయింది... అనవసరంగా గతాన్ని తవ్వుకొని బాధపడకు... మూర్తి గారితో నేను మాట్లాడతాను'' ఏదో ఒకటి మాట్లాడా లని మాట్లాడుతున్నట్టు నాకే తెలుస్తోంది!

ఆమె నెమ్మదిగా లేచి...

ఒకసారి నాకళ్ళలోకి చూసి...

రెండు చేతులెత్తి నమస్కరించి..

మౌనంగా... నిష్క్రమించింది!

ఆ తర్వాత ఒన్‌మంత్ సెలవు పెట్టి... స్వగ్రామం వెళ్లడం - కొన్ని వ్యక్తిగత సమస్యల వత్తిడి వలన... 'రాజమ్మ పంచాయతీ' విషయం... తాత్కాలికంగా... మరుగున పడిపోయింది!

★ ★ ★

''ఏమీటి? రచయితగారేవో... 'ఊహలోకాల్లో' విహరిస్తున్నట్లుంది?''

ఆమె మాటలతో... గతాన్ని వదిలి... వర్తమానం లోకి వచ్చాను. ''అంటే... మేమానాడు చెప్పిన 'తీర్పు' ... 'ముగింపు' కాదంటావ్?''

''అదే ముగింపైతే... మళ్ళీ ముగింపు చెప్పాలని ఎందుకొస్తాను?''

ప్రశ్నకు ప్రశ్నే సమాధానంగా... సంధించింది.

''అంటే- ఆనాటి తీర్పే - ఈనాటి ముగింపు కానప్పుడు -...

'అదేదో' చెప్పేస్తే...''

''చెప్పాలనే కదా వచ్చింది? మీ ఫ్రెండ్ కదా... మూర్తిగారు!

చాలామంచివారు ఔనా? నగలు - చీరలు... సినిమాలు - ఒకటేంటీ? కదా?''

ఆమె మాటల్లో తొంగిచూస్తున్న వ్యంగ్యం అర్థ మైంది!


''ఔను! ఏ భర్తయినా... అంతకంటే! యింకేం యిస్తాడు...''

నవ్వుతున్న ఆమె కళ్ళల్లోకి చూస్తూ... నేనూ వ్యంగ్యంగానే సమాధానం చెప్పాను.

''అంటే - మీరుకూడా... మీ 'వైఫ్'కి అంతే యిస్తున్నారా?

కొంచమైనా... 'ప్రేమను...' యివ్వరా?''

''అదేం ప్రశ్న? భార్యాభర్తల మధ్య... ప్రేమలేకుండా ఎలా?''




''మీకెంతమంది పిల్లలు?''

టాపిక్ మారుస్తూ హఠాత్తుగా అడిగిన ఆ ప్రశ్నకు సమాధానం చెప్పాను.

''వాళ్లెలా పుట్టారు మీకు?''

''ఎలా పుట్టటమేమిటి? పిచ్చి ప్రశ్న...!''

''పిచ్చి ప్రశ్న కాదుసార్! సంసారం చేస్తేనే కదా పిల్లలు పుట్టేది!''

''కరెక్ట్... సంసారం చేయకుండా... పిల్లలెలా పుడతారు?''

''ఆయన సంసారానికి... అనర్హులు...''

లాగి చెంపమీద కొట్టినట్లు ఫీలయ్యాను...

''ఇంత నిర్లజ్జగా మాట్లాడుతున్నానని అపార్థం చేసుకోకండి!

ఈ నిజం మీకు తెలియకపోతే... మీ దృష్టిలో... నేనెప్పటికీ-

తిరుగుబోతుగానో... వ్యభిచారిణిగానో... మిగిలి పోతాను - అందుకే...

మరి వస్తాసార్... ఈ అభాగ్యురాలిని క్షమిం చండి!''

అంటూ... వెళ్ళి పోబోతుంటే... ఆతృతగా... అడిగాను.

''ముగింపు చెప్తానని... చెప్పకుండా...?''

ప్రశ్నకు సమాధానంగా... చిన్నగా నవ్వింది!

''తప్పకుండా... నా కథ రాయండి! మర్చిపోరు కదూ...''

అంటూ కదిలిపోతుంటే...

'రాజేశ్వరీ! సారీ... సారీ... ఫర్‌మై జడ్జిమెంట్..' అంటూ... ఆమెను సాగనంపాలని... గుమ్మం దాటొచ్చి... 'షాక్ తిన్నట్టు' నిలబడిపోయాను!

ముగింపు చెప్పకుండా... 'చేసి చూపిస్తోందని' అర్థమై పోయింది.

ఎదురుగా... 'లగేజ్' కట్టుకున్న మోటార్ బైక్‌తో 'రాజారాం...'

నన్ను చూస్తూనే నమస్కరించి... 'బైక్' స్టార్ట్ చేశాడు.

ఆమె... వెనుక సీటు మీద కూర్చొని 'బై' అంటూ చెయ్యూపుతుంటే... బైక్... బయ్... మంటూ దూసుకుపోయింది.

తీర్పు ఎరుగని... 'మరో ప్రపంచానికి...'

'యువార్ గ్రేట్... 'రాజమ్మా' ... 'రాజేశ్వరీ' అనుకుంటుంటే - కలిగిన ఆనందాన్ని... వర్ణించ లేనన్న సంగతి అర్థమైపోయింది.

హాయిగా నిట్టూర్చాను!